క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డికి ఏలూరు నాయకుల పరామర్శ



వైవీ సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న జయప్రకాష్, తదితరులు

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు, వైవీ సుబ్బారెడ్డి తల్లి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో సుబ్బారెడ్డిని వైఎస్సార్‌సీపీ ఏలూరు నాయకులు సోమవారం పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపం తెలియజేశారు. వీరిలో పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ), ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవులు, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్ గుర్నాథ్, నగర బీసీ అధ్యక్షుడు కిలాడి దుర్గారావు ఉన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.6,36,719



శ్రీవారి హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి హుండీ ఆదాయం రూ.636719 సమకూరింది. ఆలయంలో జనవరి 28న చివరిసారిగా హుండీ ఆదాయం లెక్కించారు. సోమవారం నిర్వహించిన ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ పర్యవేక్షించారని, మాజీ ధర్మకర్త ఈతకోట శ్రీనివాస్, ప్రధాన అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, భక్తులు పాల్గొన్నారని ఆలయ ఈఓ నల్లూరి సతీష్ కుమార్ తెలిపారు.

విద్యుత్ సమస్యలపై 27న పరిష్కార వేదిక

పెదపాడు: విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సీజీఆర్ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో పెదపాడు విద్యుత్‌శాఖ సబ్‌స్టేషన్ వద్ద ఈ నెల 27న పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వై రాంబాబు తెలిపారు. సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ బీవీ సత్యనారాయణ, మెంబరు ఫైనాన్స్ షేక్ బాబరు, టెక్నికల్ మెంబరు బీ సులేఖరాణి, ఇండిపెండెంట్ మెంబరు ఎన్ మురళీకృష్ణలతో పాటు విద్యుత్ శాఖ ఎస్ ఈ ఈ సల్మాన్‌రాజు ఈఈ అంబేద్కర్ డీఈ శ్రీనివాస్ హాజరవుతారని చెప్పారు. వినియోగదారులు తమ సమస్యలు తెలియజేయాలన్నా

ఆధునికీకరణ పనులకు ఆటంకం

- విద్యార్థులకు సౌకర్యాలు లేనట్టే!
- నిలిచిన నాడు – నేడు పనులు
- రూ.10.51 కోట్లు విడుదల చేయని కూటమి ప్రభుత్వం



శ్రీకృష్ణదేవరాయ నగర పాలక ఉన్నత పాఠశాలలో నిలిచిన తరగతి గదులు



పిల్లర్ల వద్దే నిలిచిన చాటపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలలు సుందర నందన వనాల్లా దర్శనమిస్తున్నాయంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఘనతే అని తల్లిదండ్రులు, విద్యార్థులు గుర్తుచేసుకుంటున్నారు. మన బడి నాడు – నేడు కార్యక్రమంతో కోట్లాది రూపాయలు వెచ్చించింది. అప్పటి వరకు శిథిల దశలో ఉన్న పాఠశాలలకు కార్పొరేట్ సొబగులు అద్దింది. నాడు – నేడు కింద ఏలూరు నియోజకవర్గంలో కొన్ని పాఠశాలలను పూర్తిగా ఆధునికీకరించగా, రెండో విడతలో మరికొన్ని పాఠశాలలను ఎంపిక చేసి నిధులు మంజూరు చేసింది. ఐతే.. కూటమి ప్రభుత్వం రాగానే చకచకా జరిగే నాడు – నేడు పనులు నిలిచిపోయాయి. మొండి గోడలు, ప్లాస్టింగ్ చేయని ఫ్లోరింగ్‌లు, రంగులు వేయని తరగతి గదులు, లైటింగ్, ఫ్యాన్లు లేని పాఠశాలలు దర్శనమిస్తున్నాయి. అధికారంలోకి వచ్చి దాదాపు 9 నెలలు ముగుస్తున్నా పాఠశాలల అభివృద్ధి నిధుల విడుదల ఊసే ఎత్తడం లేదు. ఈ నేపథ్యంలో 2025–26 విద్యా సంవత్సరంలో విద్యార్థులు శిథిల భవనాల్లోనే విద్యాభ్యాసం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ఆపేసింది.

గతంలోనే అభివృద్ధి

జగన్ హయాంలో నాడు–నేడు కార్యక్రమంలో ఏలూరు నియోజకవర్గంలో తొలి విడతలో పాడుబడి, ఎప్పుడు కూలిపోతాయో అన్నట్టుగా ఉన్న 37 పాఠశాలల అభివృద్ధికి రూ.73.34 కోట్లు మంజూరు చేశారు. కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలను అభివృద్ధి చేశారు. విద్యార్థులకు సాంకేతిక విద్య అందించాలనే లక్ష్యంతో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేశారు. బ్లాక్ బోర్డుల స్థానాల్లోకి గ్రీన్ చాక్ బోర్డులు వచ్చి చేరాయి. ప్రహరీలపై విద్యార్థులకు వివిధ అంశాల్లో పరిజ్ఞానం పెంచేలా ఆకర్షణీయమైన బొమ్మలు, ఆడుకోవడానికి క్రీడా ప్రాంగణాలు, గదుల్లో చెక్క బల్లల స్థానంలో ఆధునిక డెస్కులు, చల్లటి గాలి కోసం ఫ్యాన్లు, వెలుతురు కోసం ట్యూబ్‌లైట్లు ఇలా అన్ని రకాల సౌకర్యాలూ అందుబాటులోకి వచ్చాయి.

నిధుల కొరత

ఏలూరు నియోజకవర్గంలో రెండో విడత నాడు – నేడు కార్యక్రమంలో 63 పాఠశాలల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ హయాంలో రూ.22.03 కోట్లు మంజూరు చేసింది. వీటిలో మార్చి నెలకు ముందుగానే రూ.11.51 కోట్లను విడుదల చేసింది. వీటితో 28 పాఠశాలలను ఆధునికీకరించారు. మరో 35 పాఠశాలల్లో శ్లాబులు వేయడం, గోడలు కట్టడం, ప్లాస్టింగ్‌లు వంటి పనులు పూర్తి చేశారు. మిగిలిన ఫ్లోరింగ్, కిటికీలుడం, టైల్స్, రంగులు, ప్లంబింగ్, విద్యుదీకరణ, మరుగుదొడ్ల పనుల పూర్తికి నిధుల కొరత ఏర్పడింది. ఈ పనులకు రూ.10.59 కోట్లు విడుదల చేయాల్సుంది. కూటమి ప్రభుత్వం నిధుల విడుదలపై స్పందించకపోవడంతో ఈ 35 పాఠశాలల అభివృద్ధిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

చదువుకు దూరం చేయడమే లక్ష్యమా?



పేద విద్యార్థులను చదువులకు దూరం చేసి, పేదలు పేదల్లానే మిగిలిపోవాలనే ఉద్దేశ్యం ప్రభుత్వం నుంచి వ్యక్తమవుతున్నట్టుగా అర్థమవుతోంది. గత ప్రభుత్వం మంజూరు చేసి సగానికి పైగా నిధులు విడుదల చేసి పాఠశాలలను అభివృద్ధి చేస్తుండగా, కూటమి ప్రభుత్వం ఆ నిధులను ఆపేసి అభివృద్ధిని అడ్డుకోవడం దారుణం. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పేదల విద్యాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలి.

– కాకి నాని, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

నిధులు విడుదల చేయాలి



రాజకీయాలను పక్కన పెట్టి ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి పాఠశాలల్లో నిలిచిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలి. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి తరగతి గదులను వినియోగంలోకి తేవాలి. పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాలు ఏర్పాటు చేయడం ప్రభుత్వం బాధ్యత అని గుర్తించాలి. పేద విద్యార్థులు డ్రాపౌట్లను అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

– లెనిన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

మహిళల భద్రతకు శక్తి యాప్



శక్తి యాప్‌ను చూపుతున్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహిళలు అత్యవసర సందర్భాల్లో ఒక్క క్లిక్‌తో పోలీసులకు సమాచారం చేరేలా శక్తి యాప్ రూపొందించినట్టు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు అన్నారు. ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు సోమవారం నగరంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. యాప్ వినియోగం, ప్రాముఖ్యత, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలో వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు తమ భద్రతకు సంబంధించిన సమస్యలను భయపడకుండా, సంకోచం లేకుండా పోలీసులకు తెలియజేయాలని, శక్తి యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు, మహిళా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి రుణాలకు గడువు పెంపు

గణపవరం: వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకునే ఈనెల 25వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఎంపీడీఓ బేబీ శ్రీలక్ష్మి తెలిపారు. వాస్తవానికి గడువు ఈనెల 22వ తేదీతో ముగియగా మరో మూడు రోజులు ప్రభుత్వం పెంచిందని ఈనెల 25వతేదీ మంగళవారంతో గడువు ముగుస్తుందన్నారు. 2024–25వ సంవత్సరం బీసీ, ఓబిసి, బ్రాహ్మణ, కాపు,కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య మొత్తం 7 కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేస్తామన్నారు.

అనుమతులు లేకుండా వృక్షం తొలగింపు



జిల్లా పరిషత్ ఆవరణలో వందేళ్ల నాటి చెట్టును నరికేసిన దృశ్యం

ఏలూరు(మెట్రో): జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రధాన ముఖద్వారం పక్కనే ఉన్న అనేక ఏళ్ల నాటి వృక్షాన్ని తొలగించడం విమర్శలకు తావిస్తోంది. స్వలాభం కోసం అనుమతులు తీసుకోకుండా చెట్టును నరికివేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్థలాన్ని లీజుకు ఇచ్చినప్పటికీ కొమ్మలు తొలగించి భవనాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా, జిల్లా పరిషత్ యాజమాన్యానికి, కాంట్రాక్టర్‌కు మధ్య లక్షల రూపాయలు చేతులు మారడంతో పూర్తి స్థాయిలో చెట్టును తొలగించేందుకు జిల్లా పరిషత్ సైతం అడ్డుచెప్పలేదనే ప్రచారం నడుస్తోంది. ఏళ్ల సంవత్సరాల నాటి చెట్టును తొలగించాలంటే అటవీశాఖ అనుమతులు తప్పనిసరి. దీనిపై జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈఓ వివరణకోరగా గుత్తేదారుడికి నోటీసులు ఇచ్చామని, పోలీసులు చెట్టు నరికిన వ్యక్తులపై కేసు నమోదు చేశారని చెప్పారు. చెట్టును నరికిన వ్యక్తులపై ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నూకాలమ్మ సేవలో భక్తులు



తపన చౌదరిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేట నూకాలమ్మ ఆలయంలో దేవాదాయ శాఖ, ఉత్సవ కమిటీ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారి 45వ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తుతున్నారు. తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి సోమవారం ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసి అమ్మవార్ని దర్శించుకున్నారు. ఆలయంలో విశిష్ట పూజలు నిర్వహించారు. నూకాలమ్మ ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అర్చకులు మంత్రవాది రామకృష్ణ యోగానంద శాస్త్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ తరుణంలో దావాలా రంగ సత్యనారాయణ, కమిటీ సభ్యులు గారపాటి సీతారామాంజనేయ చౌదరిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ఆరుగురు డ్రైవర్లకు రివర్షన్

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థలో డ్రైవర్లుగా పనిచేస్తున్న వారిలో ఆరుగురికి సరైన అర్హతలు లేవనే కారణంతో రివర్షన్ ఇచ్చారు. నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో 14 డ్రైవర్ పోస్టులున్నాయి. వీటిలో 9 ఖాళీలుండగా పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది 9 మందిని ఎంపిక చేసి డ్రైవర్లుగా పదోన్నతులను కల్పిస్తూ 2022 మార్చిలో నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ తీర్మానించింది. నిబంధనల మేరకు విధుల్లో చేరే సమయానికి హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ పొంది మూడేళ్లు నిండి ఉండాలి. కానీ వీరిలో ఆరుగురికి అర్హత లేదని ముగ్గురికే అర్హత ఉండడంతో అర్హత లేని ఆరుగురికి రివర్షన్ ఇచ్చినట్టు కమిషనర్ ఎ.భాను ప్రతాప్ తెలిపారు. డ్రైవర్‌గా అర్హత ఉన్న ముగ్గురికి దానికి సంబంధించిన అలవెన్సులు, జీతాలు వంటి ప్రయోజనాలు అందుతాయన్నారు. రివర్షన్ పొందిన ఆరుగురుకి వారి మాతృ శాఖలో రావాల్సిన ప్రయోజనాలు అందుతాయని తెలిపారు.

మతోన్మాద శక్తులపై పోరాడుదాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న దేగా ప్రభాకర్

ఏలూరు (టూటౌన్): దేశంలో లౌకికవాదానికి తూట్లు పొడుస్తూ పాలన సాగిస్తున్న మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను నిర్వహిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన ప్రచార జాతా స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్, జిల్లా పరిషత్, కొత్త బస్టాండ్, సత్రంపాడు, ఫిరంగుల దిబ్బ, విద్యానగర్, సెంట్ ఆన్స్ కళాశాల, అమీనా పేట, ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల మధ్య మత విద్వేషాలు రగిలించి మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని, మూడోసారి అధికారంలోకి వచ్చి ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ 100 సంవత్సరాల పండుగ జరుపుకుంటుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి సహకారం అందడం లేదని తెలిపారు. జాతాలో సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి, ఏరియా కార్యవర్గ సభ్యురాలు మావూరి విజయ, అడ్డగర్ల లక్ష్మి ఇందిర, కొల్లూరు సుధారాణి, నాగం అచ్యుత్, ఉప్పులూరి లక్ష్మి, భవాని, గొర్లి స్వాతి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి డి.శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి



వెంకటాపురంలో కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): రైతులు రసాయన వ్యవసాయాన్ని మాని, ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ సంయుక్త డైరెక్టర్ ఎస్‌కే హబీబీ బాషా, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేష్‌లు సూచించారు. సోమవారం ఏలూరు మండలం వెంకటాపురం గ్రామంలో ప్రీ మోన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పీఎండీఎస్ పద్ధతులు పాటించడం వల్ల వచ్చే 14 రకాల లాభాలను వివరించారు. రసాయన వ్యవసాయ విధానాలను వదిలి ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలని అన్నారు. ఈ మార్పు మట్టిలో పర్యావరణ స్నేహితమైన పౌష్టికతను పెంచి, రైతులకు మంచి దిగుబడులు, పురుగులు, ఔషధ వృక్షాలు సమస్యలను నివారించడంలో సహాయపడతుందని వివరించారు. కార్యక్రమంలో 15 వేల పీఎండీఎస్ కిట్‌లను పంపిణీ చేశారు. రైతులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	38	బీన్సచిక్కుడు	88
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	48
బెండకాయలు	34	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	26	కంద	76
కాకర కాయలు	34–40	బీట్‌రూట్	30
బీరకాయలు	30	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30–38	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	32	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	30	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07–10
దోసకాయలు	24–34	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	50
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు – తిరుపతి (ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	31
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	32
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	32
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	34
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	రద్దు
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

పోలీస్ స్కూల్‌కు కంప్యూటర్ల వితరణ



ఎస్పీకి కంప్యూటర్లను అందిస్తున్న పారిశ్రామిక వేత్త కేకే గుప్తా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు నగరానికి చెందిన పారిశ్రామికవేత్త కేకే గుప్తా ఎనిమిది కంప్యూటర్లను అందజేశారు. కేకే గుప్తా ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ కంప్యూటర్లను సోమవారం ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేకే గుప్తా సేవా దృక్పథం విద్యార్థులకు నూతన సాంకేతికతను నేర్చుకునే అవకాశాన్ని అందించి, వారి భవిష్యత్తును మెరుగుపరిచేలా చేయడంలో సహాయపడుతుందని అన్నారు. ఈ కంప్యూటర్ల ద్వారా విద్యార్థులకు డిజిటల్ విద్యను మరింత చేరువ చేస్తామని తెలిపారు. ఇలాంటి మహోన్నత సేవా కార్యక్రమాలకు మరింత మంది ముందుకు రావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర రావు, డీఎస్పీ రెడ్డి శ్రవణ్ కుమార్, ఏఆర్ ఆర్ఐ పవన్ కుమార్, ఆర్ఎస్ఐ నరేంద్ర, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు స్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ వరప్రసాద్ సాయిరాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉద్యోగాలు



విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాల కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో సోమవారం రాజమండ్రికి చెందిన అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్ సంస్థ సహకారంతో హైదరాబాద్‌కు చెందిన ఎన్ఎస్ఐటీ సంస్థ ప్రతినిధులు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఎన్ఎస్ఐటీ సంస్థ బిజినెస్ హెడ్ జె.కల్యాణి, సేల్స్ హెడ్ ఎ.వంశీ, టి.సాయిరాం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న 110 మందికి తొలుత గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి 40 మందిని ఎంపిక చేశారు. వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి 22 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ప్రిన్సిపాల్ జి.సరళ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.ఝాన్సీలక్ష్మి, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ప్రతినిధి జీఎస్ఆర్ కల్యాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఉంటే షాదీ ముబారక్ ఇవ్వండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముస్లింలకు కంటితుడుపు చర్యగా ఇస్తున్న ఇఫ్తార్ విందులు అవసరం లేదని, ముస్లిం యువతుల వివాహాలకు ఉపయోగపడే షాదీ ముబారక్ ఇవ్వాలని సామాజిక కార్యకర్త ఎండీ ఇస్మాయిల్ షరీఫ్ ఒక ప్రకటనలో కోరారు. టీడీపీ ప్రభుత్వం గతంలో ప్రవేశ పెట్టిన తాళిబొట్టు, పెళ్లి కానుక, షాదీ ముబారక్ పథకాలను ప్రస్తుతం తానే తుంగలో తొక్కడం తిరోగమనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ పథకాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి అమలు చేసి పేదల ఇంట ఆడపిల్లల పెళ్లికి సహకరించేదని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెలా ఏదో ఒక సాకు చూపి వేలాది పింఛన్లు తొలగించి పేదల, వికలాంగుల కడుపుకొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఉంగుటూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్ వైజరు వి.లక్ష్మి బాలికలకు సూచించారు. సోమవారం బాల్యవివాహాలు నిరోధంపై అవగాహన కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి మాట్లాడుతూ మంచి ప్రవర్తనతో చదువు కొనసాగించేలా ఆలోచనలు ఉండాలన్నారు. తల్లిదండ్రులు చెప్పిన మంచి విషయాలను నేర్చుకోవాలని సూచించారు. జిల్లా కో ఆర్డినేటర్ ఆర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ బాల్యవివాహాలు ప్రోత్సహించిన వారి మీద, హాజరైన వారిమీద కఠిన చర్యలు తీసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్ వైజర్ నాగలక్ష్మి, బాలికల వసతి గృహం వెల్ఫేర్ ఆఫీసర్ మాదవి, సీహెచ్ రేఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదపాడులో న్యాయ విజ్ఞాన సదస్సు

పెదపాడు: హత్యాచార ఘటనలను ఎదుర్కొనే విధానాన్ని విద్యార్థులకు తెలియజేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ తెలిపారు. మండలంలోని కలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. సునీల్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు సమాజంలో ఎదురయ్యే సమస్యలు వాటి వల్ల కలిగే అనర్థాలు, వాటిని పరిష్కరించుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఎప్పటికప్పుడు చైతన్య పరచాలని సూచించారు.

క్షయ నివారణకు సమష్టి కృషి

గణపవరం: క్షయ వ్యాధిని సమాజం నుంచి పూర్తిగా తొలగించడానికి అందరి సమష్టి కృషి అవసరమని గణపవరం ప్రభుత్వ డిగ్రీకాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి, జిల్లా పీఎంపి అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు అన్నారు. సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా క్షయవ్యాధిపై అవగాహన సదస్సులు, ప్రదర్శనలు నిర్వహించారు. క్షయవ్యాధి పూర్తిగా నివారించగల వ్యాధి అని, సకాలంలో వైద్యసహాయం పొందకపోవడం వల్లనే క్షయ వ్యాధి ప్రాణాంతకంగా మారుతుందన్నారు. గణపవరం పీహెచ్‌సీలో నిర్వహించిన క్షయవ్యాధి అవగాహన కార్యక్రమంలో వైద్యాధికారిణి పి.కిరణ్మయి మాట్లాడుతూ మూడు అంతకన్నా ఎక్కువ కాలం దగ్గు ఉండటం, రక్తం లేదా శ్లేష్మంతో కూడిన దగ్గు, ఛాతీనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, బరువుతగ్గడం, అలసట, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, చలితో కూడిన వణుకు తదితర లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించాలని సూచించారు. క్షయ వ్యాధి ఉన్నవారు ఇంటిపట్టునే ఉండాలని, తప్పనిసరిగా మాస్క్ ధరించాలన్నారు. పీహెచ్‌సీలో క్షయకు ఉచిత పరీక్షలు, మందులు ఇస్తారని తెలిపారు. ఈ సందర్భంగా క్షయవ్యాధిపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల పిఎంపి అసోసియేషన్ అధ్యక్షుడు ఎం .సత్యనారాయణమూర్తి, పిఎంపి సభ్యులు శివశ్రీనివాసరావు, అప్పారావు, పానకాలు, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజాన్ని స్థాపిద్దాం

భీమడోలు: క్షయ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు, గుండుగొలను, పోలసానిపల్లి గ్రామాల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో సోమవారం ఆయన పాల్గొని ప్రారంభించారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ దినోత్సవాన్ని కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, సర్పంచ్‌లు షేక్ రహీమాబేగం, కూర్మా లక్ష్మి, టీబీ సూపర్‌వైజర్ తోట మనోజ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు, మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, మండల నాయకులు ప్రత్తిమదన్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, వాసు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.